క్లుప్తంగా

పొన్నంను కలిసిన కాంగ్రెస్ నేతలు



ముషీరాబాద్: హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జి.ఎన్.కేశవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల యాదగిరి, కృష్ణారావు తదితరులు ఆయన నివాసంలో కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా మంత్రి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలకు సూచించారు. త్వరలో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో నియోజకవర్గంలో అత్యధిక సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుపొందే విధంగా కృషి చేయాలని కోరారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వసుంధర, విజయకుమార్, రజిత్, గోదాలక్ష్మి, ఇందిరా

చిక్కడపల్లి: సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో 50వ అఖిల భారత సంగీత నృత్య పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వహణ సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తెలిపారు. శనివారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో సంబంధింత కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర హాజరై మాట్లాడారు. వర్ధమాన కళాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల కళాకారులు వివరాలకు 94907 92286లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రజిత్ ఆకుల, డాక్టర్ కామిశెట్టి గోదాలక్ష్మి, డాక్టర్ ఇందిరా హేమలత పాల్గొన్నారు.

నేడు దసరా మహిళా సమ్మేళనం

కాచిగూడ: స్త్రీహస్తిన మహిళా మండలి ఆధ్వర్యంలో ఈనెల 5న ఆదివారం ఉదయం 10 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీ ఆంధ్ర మహిళా సభ, మామిడిపూడి వెంకట రంగయ్య హాల్‌లో దసరా మహిళా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మహిళా మండలి అధ్యక్షురాలు ఎర్రం పూర్ణశాంతి గుప్త తెలిపారు. ఈ సందర్భంగా 100 మహిళా గో సేవకులకు సత్కార కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఆనంద్, కరాటే కల్యాణి, సత్యవతి ప్రసన్న, వీర మధ్వీ, సురేష్, ప్రేమ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతి, దుర్గా భవానీ, తేలు రిషిత, పైలా శైలజ, డాక్టర్ కీర్తన యాదవ్, రేవతి సమ్మెట, రూప, శిరీష, డాక్టర్ ఆర్.వి.లక్ష్మలకు నవదుర్గ పురస్కారాలను అందించనున్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించిన ముగ్గురి అరెస్ట్

కాచిగూడ: కానిస్టేబుల్ విధులను అడ్డుకొని తాగిన మైకంలో దురుసుగా ప్రవర్తించిన ముగ్గురిని కాచిగూడ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ కృష్ణవేణి తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్రకు చెందిన శ్రీజిత్ (24) కర్ణాటకకు చెందిన టి.లక్ష్మణ్ (24), లావు (31) ముగ్గురు స్నేహితులు. చప్పల్‌బజార్‌లో విధులు నిర్వహిస్తున్న కాచిగూడ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్‌పై తాగిన మైకంలో దురుసుగా వ్యవహరించి విధులను అడ్డుకున్నారు. దీంతో కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు. పోలీసుల విధులను అడ్డుకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

రైలు ప్రయాణికురాలి ల్యాప్‌టాప్ బ్యాగ్ చోరీ

కాచిగూడ: కాచిగూడ రైల్వేస్టేషన్‌లోని రెండవ ప్లాట్‌ఫారం వద్ద ప్రయాణికురాలు మర్చిపోయిన ల్యాప్‌టాప్ బ్యాగును దొంగలు తస్కరించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం..మెహిదీపట్నంకు చెందిన రాచన్ రోజ్ బెంగుళూర్ వెళ్లడానికి శనివారం కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. ఉదయం 5:30 గంటలకు రెండవ ప్లాట్ పారంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగును మర్చిపోయింది. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పింది. వారు వచ్చి రెండో ప్లాట్ ఫారం వద్ద వెతికినా బ్యాగ్ కనిపించలేదు. బ్యాగులో ల్యాప్‌టాప్, పాస్‌పోర్టు, ఇతర పత్రాలున్నాయి. బాధితురాలు తరపున చెల్లెలు శరన్ రోజ్ కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యత పాటించకుంటే లైసెన్స్‌లు రద్దు

గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి



జీఎంసీ ప్లాజా క్యాంటీన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి, ఆర్ఎంఓలు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఫుడ్ క్యాంటీన్ల యాజమాన్యాలు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి హెచ్చరించారు. ఆస్పత్రి పాలన యంత్రాంగంతో కలిసి గాంధీ ప్రాంగణంలోని క్యాంటీన్లలో శనివారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా ఫుడ్ క్యాంటీన్ల నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. జయశంకర్ విగ్రహం ఎదురుగా ఉన్న జీఎంసీ ప్లాజా క్యాంటీన్ అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి అసహనం వ్యక్తం చేశారు. నిల్వ ఉంచిన పలురకాల పండ్ల రసాలు, పాల ప్యాకెట్లను పరిశీలించి క్యాంటీన్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆస్పత్రి వైద్య సిబ్బంది, రోగులు, రోగి సహాయకులు తినే ఆహారపదార్థాలు నాణ్యతతో ఉండాలని లేకుంటే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని అన్నారు. జీఎంసీ ప్లాజా క్యాంటీన్‌లో ఫ్రూట్ జ్యూస్ సెంటర్ నిర్వహణకు అనుమతిలేదని, ఓపీ ఎదురుగా ఉన్న ఫెషీ క్యాంటీన్ కాలపరిమితి ముగిసినా ఇంకా కొనసాగుతుందని అన్నారు. అక్కడ తీవ్రమైన అపరిశుభ్రత నెలకొందని ఆస్పత్రి పాలనయంత్రాంగం సూపరింటెండెంట్ దృష్టికి తేగా, గడువు ముగిసినా గాంధీ ప్రాంగణంలో కొనసాగుతున్న వ్యాపార సముదాయాలపై న్యాయపరమైన అంశాలపై ఉన్నతాధికారులు, న్యాయనిపుణుల సలహాలు, సూచనల మేరకు తగిన చర్యలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. త్వరలోనే మరోమారు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, పరిస్థితుల్లో మార్పులేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఘనంగా శంకర శర్మ జయంతి



శ్రీనివాస శర్మ, యశస్విని కీర్తనల గాన కచేరి

నల్లకుంట: సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా ఆలయం మొదటి అంతస్థులో గల ధ్యాన మందిరంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు, సరస్వతి సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు పోపూరి శంకర శర్మ 105వ జయంతిని నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన కార్యక్రమానికి హాజరైన ప్రముఖ వీణా విద్వాంసుడు, పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాస శర్మ, ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతమూర్తి, శరత్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమాన్ కృష్ణ, ఆధ్యాత్మికవేత్త పోపూరి రామ్మోహన్ రావుతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన శంకర శర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస శర్మ, వర్ధమాన గాయినీమణులు తేజస్విని, యశస్విని, కీర్తనల గానం, విద్యార్థులు ఆలపించిన శంకర శర్మ రచనల గానం ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే సంగీత విద్యాలయం విద్యార్థులు దివిజ, సాయి, సంధ్య, హితాన్, మనోజ్ఞ, అభిజ్ఞ, అద్వైత్, అద్రిత్, అభియ్ కీర్తనల గానం ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. దీనికి వయోలిన్‌పై అచ్యుత కుమారి, మృదంగంపై దుర్గాకుమార్ వాద్య సహకారమందించారు.

రాజ్యాధికారం దిశగా బీసీలు ఉద్యమించాలి



మాట్లాడుతున్న సింహాద్రియాదవ్

కాచిగూడ: రాజ్యాధికారం దిశగా బీసీలు ఉద్యమించాలని సమాజ్‌వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి యాదవ్ పిలుపునిచ్చారు. సమాజ్‌వాది పార్టీ 33వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ప్రొఫెసర్ సింహాద్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ములాయం సింగ్ నేతృత్వంలో 1992లో సమాజ్‌వాది పార్టీ ప్రారంభమైందన్నారు. సమ సమాజ స్థాపన, సామాజిక పరివర్తన లక్ష్యాలతో సమాజ్‌వాది పార్టీ ముందుకు పోతుందన్నారు. లోహియా, అంబేడ్కర్‌ల ఆలోచనల్లో భాగంగా స్త్రీ, పురుష, పేద, ధనిక వర్గ సమానత్వం కోసం పార్టీ పనిచేస్తుందని తెలిపారు. పీడీఏ వ్యూహంతో సామాజిక వర్గాలకు రాజ్యాంగ అధికారం సాధించాలని పార్టీ తీర్మానించిందని, రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, మతసామరస్యాన్ని కాపాడటం, సమ సమాజ నిర్మాణం కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు శ్రీహరి ముదిరాజ్, రిజ్వాన్ హుస్సేన్, మాజీద్ సిద్ధికి, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

చిక్కడపల్లి: సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్, శ్రీ ధన్వి కళానిలయం ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రేక్షక రంజకంగా సాగింది. ఈ సందర్భంగా ప్రముఖ నృత్య కళాకారిణి అరుణస్వరూప్ తల్లి రామలక్ష్మి స్మృతిలో చేసిన అర్ధనారీశ్వవరం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సమావేశంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ పసుమర్తి రామలింగశాస్త్రి ముఖ్యఅతిథిగా హాజరై నృత్య కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరి శేషసాయి, కూచిపూడి గురువు పద్మ కళ్యాణ్, ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ కిరణ్మయి, సీనియర్ న్యాయవాది కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



అర్ధనారీశ్వవరం నృత్య ప్రదర్శన చేస్తున్న నృత్య కళాకారిణి అరుణస్వరూప్, శిష్యబృందం

'మనో విహారి' కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న దినకరరావు, మోహన్, వెంకటకృష్ణమూర్తి

చిక్కడపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ త్యాగరాయ గానసభల సంయుక్తాధ్వర్యంలో ప్రముఖ అనువాద రచయిత కస్తూరి రాజశేఖర్ రచించిన 'మనో విహారి'కవితా సంపుటి ఆవిష్కరణ శనివారం గుండవరపు హనుమంతరావు కళా వేదికలో జరిగింది. ఎస్బీహెచ్ పూర్వ సీజీఎం పి.దినకరరావు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. రెండున్నర దశాబ్దాలుగా అనువాద రంగంలో తనదైన శైలిలో అందరికీ అర్థమయ్యే విధంగా అనువాదించి పాఠకుల మన్ననలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, వెంకటకృష్ణమూర్తి, నాగేశ్వర్‌రావు, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



ఐమ్యాక్స్ చౌరస్తాలోని ఇందిరా గాంధీ విగ్రహం చౌరస్తాలో పూల గార్డెన్

బంజారాహిల్స్: ప్రతి మూడు, నాలుగు నెలలకోసారి హెచ్ఎండీఏ అధికారులు పలు కూడళ్లలో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం రంగురంగుల పూలమొక్కలు నాటుతున్నారు. ఇందులో భాగంగా ఖైరతాబాద్‌లోని ఐమ్యాక్స్ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం చుట్టూ పూల మొక్కలను ఏర్పాటు చేశారు. విరివిగా పూలు పూయడంతో వాహనదారులతో పాటు ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డుకు వచ్చే సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పలువురు ఈ గార్డెన్ వద్దకు వచ్చి సెల్ఫీలు తీసుకుంటూ సరదాగా గడుపుతున్నారు.

డేటా అనలిటిక్స్, ఏఐ కోర్సులో ఉచిత శిక్షణ

ముషీరాబాద్: పదోతరగతి పాసై ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18–27 ఏళ్ల వయస్సు మధ్య గల నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు డేటా అనలిటిక్స్, ఏఐ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు స్వాంతన చారిటబుల్ ట్రస్ట్ కో ఆర్డినేటర్ శ్రీశా తెలిపారు. శనివారం పార్సిగుట్ట, గంగపుత్ర కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో అడ్వాన్స్ ఎక్సెల్, పవర్ బీఐ, ఎస్క్యూఎల్, బేసిక్ పైథాన్, ఏఐ టూల్స్ వంటి అంశాలను కూడా ప్రత్యేకంగా బోధించనున్నట్లు తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్నెట్ పరిజ్ఞానం, ఇంగ్లిష్ టైపింగ్ వంటి అర్హతలు ప్రస్తుతం ఉద్యోగ అవకాశాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువకులు విద్యా అర్హత సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, రెండ్ పాస్‌పోర్టు సైజు ఫొటోలతో స్వాంతన చారిటబుల్ ట్రస్ట్ శిక్షణ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 86889 14603లో సంప్రదించాలని సూచించారు.

7న హిజ్రాల హక్కులపై రాష్ట్ర సదస్సు



మాట్లాడుతున్న ముద్రబోయిన రచన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హిజ్రాల హక్కులు, బాధ్యతలు అనే అంశంపై ఈ నెల 7న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా ట్రాన్స్ జెండర్స్ అసోసియేషన్ ప్రతినిధి ముద్రబోయిన రచన, టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..ట్రాన్స్ జెండర్స్ ప్రజలతో మమేకం కావాలని కోరారు. తమ హక్కుల కోసం పోరాడుతునే ప్రజలతో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ అసోసియేషన్ అధ్యక్షురాలు మోనాలిసా తదితరులు పాల్గొన్నారు. జ

భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహ నిమజ్జనం



అమ్మవారిని మంగళహారతులతో పూజిస్తున్న మహిళలు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని దుర్గ నల్లపోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద శరన్నవరాతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన్నట్లు ఆ ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ భవాని శ్రీనివాస్, ఉత్సవాల నిర్వాహకులు డాక్టర్ కె.నరేష్‌గౌడ్ తెలిపారు. ఉత్సవాల్లో చిక్కడపల్లి వివేక్‌నగర్ కాలనీ వాసులు, మహిళలు పాల్గొని ఉత్సవాలను నిర్వహించడానికి సహకరించారన్నారు. శనివారం రాత్రి నిమజ్జనానికి తరలించేముందు అమ్మవారి విగ్రహానికి మహిళలు మంగళహారతులు ఇచ్చారు.

6న ఉప్పల్‌లో నిరాహారదీక్ష

ఉప్పల్: నారాపల్లి నుంచి ఉప్పల్ ఎలివేటిడ్ కారిడార్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ ఈనెల 6న ఉదయం 10 గంటల నుంచి మేడ్చల్ జిల్లా సీపీఎం పార్టీ అధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తాలో నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు సీపీఎం పార్టీ నేతలు ప్రకటించారు. ఈ దీక్ష ప్రారంభానికి సీపీఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా స్థానికులు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.

12 వరకు మానసిక ఆరోగ్య వారోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలను లయన్స్ క్లబ్ 320 ఎ, ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ 320 ఎ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం సుందరయ్య పార్కులో మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ..మానసిక ఆరోగ్యం బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి పైగా ప్రజలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ప్రతి ఏడుగురిలోకి ఒకరికి ఈ సమస్య ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందన్నారు. యువతలో ఆత్మహత్యకు ప్రధాన కారణం మానసిక సమస్యలే అన్నారు. మెంటల్ హెల్త్ అవైర్‌నెస్ కో ఆర్డినేటర్ డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ..ఒకరినొకరు పోల్చుకోవడంతో మానసిక ఆరోగ్యానికి గురవుతున్నారన్నారు. మానసిక సమస్యలనేవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ నెల 5న ఏవీ కళాశాలలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆటపాటలు, డ్యాన్స్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ చీఫ్ ఆడ్మినిస్ట్రేటర్ రమేష్ చంద్రబాబు, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పివి.నిరంజన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, డిప్యూటీ గవర్నర్ శైలజ మోహన్, కృష్ణవేణి, హౌస్‌ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావు, పి.శంకర్ జి.లక్ష్మీ, డాక్టర్ స్పందన పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరిట్ అవార్డుల ప్రదానం



మెరిట్ అవార్డులను అందుకుంటున్న విద్యార్థులు

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మెరిట్ అవార్డులను అందజేశారు. కార్యక్రమానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ ఎస్.అంజనారెడ్డి అధ్యక్షత వహించారు. 545 మంది విద్యార్థులను ఎంపిక చేసి రూ.10 లక్షల 28 వేలతో విద్యార్థులకు పారితోషికం, మెరిట్ సర్టిఫికెట్ అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన దేవాదాయ ధర్మాదాయ శాఖ అదనపు కమిషనర్ ఎంఎండీ కృష్ణవేణి, డిప్యూటీ కమిషనర్ కె.వినోద్ మాట్లాడుతూ..విద్యార్థులు కష్టపడి సాధించిన ప్రతిభను గుర్తించి సన్మానించడం ద్వారా మరిన్ని విజయాలను సాధించేందుకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం మాజీ ట్రస్ట్ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కుల సంఘం నేతలు పాల్గొన్నారు.

తెలంగాణ బాలోత్సవం పిల్లల జాతర రిసెప్షన్ కమిటీ ఎన్నిక



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కె.వి.రమణాచారి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బాలోత్సవం 5వ పిల్లల జాతర కార్యక్రమాన్ని నవంబర్ 6, 7 తేదీల్లో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పిల్లల జాతర రిసెప్షన్ కమిటీని ప్రకటించడంతోపాటు, పిల్లల జాతరకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కమిటీ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి, చీఫ్ ప్యాట్రన్‌గా జస్టిస్ జి.రాధారాణి, సుద్దాల అశోక్‌తేజ, ఏనుగు నరిసింహరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ ఎండీ రియాజ్, ప్యాట్రన్స్, వైస్ ప్రెసిడెంట్స్, సెక్రట్రీస్ 90 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ పిల్లల జాతరలో 24 ఈవెంట్లుగా 24 వేదికలపై విద్యార్థులకు పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలను విద్యార్థుల నైపుణ్యతను వెలికి తీయడానికి ఉపయోగపడుతుందని కె.వి. రమణాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎస్.సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షురాలు సుజావతి, మహేష్ దుర్గే, జె.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి చీరలు పొందడం వరప్రసాదం



వేలంలో చీరలను దక్కించుకున్న మహిళలు, బస్తీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ఉమేష్, అశోక్, రాజ్‌కుమార్


చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో అరుంధతినగర్‌లో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో శనివారం అమ్మవారి నిమజ్జనం సందర్భంగా చీరల వేలంలో మహిళలు, బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ యాదవ్, ఉమేష్, అశోక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరిగాయన్నారు. వేలంలో మహిళలు పాల్గొని చీరలు దక్కించుకోగా అమ్మవారి చీరలు తీసుకోవడం వరప్రసాదమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సతీష్‌కుమార్, కైలాష్, శ్రీకాంత్‌యాదవ్, గడప పవన్‌కుమార్,సామెల్, నాగరాజు, విశాల్, సాయికుమార్, బాబీ, రోహిత్, పవన్, శశాంక,కిరణ్, అభిలాష్, ఇంద, చంద్రతేజ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలకు ఉపాధ్యాయుల బృందం



లాలాపేట: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) హైదరాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులు శనివారం జాతీయ మహాసభలకు పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి జైపూర్‌కు తరలివెళ్లారు. ఈ మేరకు తపస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. తిరుపతిరెడ్డి, వీరేశ్ మాట్లాడుతూ.. కేంద్ర సంస్థ అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో ఈ నెల 5,6,7 తేదీల్లో రాజస్థాన్ జైపూర్‌లో 9వ జాతీయ మహా సభలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ సభల్లో పాల్గొనడానికి హైదరాబాద్ జిల్లా నుంచి దాదాపు 13 ఉపాధ్యాయుల బృందం బయలుదేరి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు, దేశాన్ని సమున్నత స్థితిలో నిలపడం కోసం ఉపాధ్యాయులు నిర్వర్తించాల్సిన కృషి తదితర అంశాలపై దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులతో ఈ సభల్లో చర్చిస్తారని పేర్కొన్నారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన ప్రతిపాదనలు అందజేస్తారని అన్నారు. జైపూర్‌కు వెళ్లిన వారిలో వీరేశ్, లక్ష్మీనారాయణ, వీరకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, రజనీదేవి, మంజుల, అనురాధ, సీహెచ్ జ్యోతి, సునీత రాణి, కరుణశ్రీ, ఇందిరా, ఏ జ్యోతి, సురేఖా బాయి తదితరులు ఉన్నారు.

5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సామికా



బన్సీలాల్‌పేట్: కష్టపడితే అసాధ్యం అంటూ ఏమీ ఉండదని.. చదువుతోనే అనుకున్నది సాధించవచ్చని నిరూపించింది సామికా. పోటీ ప్రపంచంలో కష్టపడి ఏకంగా 5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, గ్రూప్ 2, 3 లతో పాటు గ్రూప్ 4 కూడా సాధించింది. బన్సీలాల్‌పేట్ నివాసి రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి వైఎం. విజయ్‌కుమార్, ప్రభావతి దంపతుల కుమార్తె వై. సామికా అయిదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. ఆమె సికింద్రాబాద్ సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో ఎస్ఎస్‌సీ ఇంటర్‌తో పాటు బేగంపేట్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఏంఏ పూర్తి చేసి ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నది. త్వరలో రెవెన్యూ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు సహకారం, ప్రోత్సాహంతో కష్టపడి, అంకితభావంతో చదివితే ఏ రంగంలోనైనా మంచి ఫలితాలను వస్తాయన్నారు. 5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సామికాను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శాలువతో అభినందించారు. ఆమె ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ద్వారా యువతకు ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.